క్లుప్తంగా

ఫుట్‌బాల్ రిటైర్డ్ కోచ్ సుబ్బారావు మృతి



సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించిన గోపీచంద్

ఏలూరు రూరల్ : శాప్ రైటర్డ్ ఫుట్‌బాల్ కోచ్ కాశీ సుబ్బారావు అనారోగ్యంతో గురువారం ఉదయం ఏలూరులో మృతి చెందారు. ఆయన 30 ఏళ్ల పాటు ఫుట్‌బాల్ కోచ్‌గా సేవలందించారు. మధ్యాహ్నం ఏలూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సుబ్బారావు మృదేహంపై ఆయన అల్లుడు, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, మాజీ ఎంపీ మాగంటి బాబు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు, ఫుట్‌బాల్ కోచ్ సిరాజుద్దీన్‌తో పాటు ఏలూరులో ఫుట్‌బాల్ క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావు సేవలను కొనియాడారు.

నేడు ఏలూరులో వైఎస్సార్ సీపీ ర్యాలీ



జయప్రకాష్

ఏలూరు టౌన్: రైతులు, ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరులో శుక్రవారం ఉదయం 10గంటలకు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఏలూరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, ప్రజలంతా హాజరుకావాలని కోరారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని వృద్ధురాలు తీవ్ర గాయాలపాలైంది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు సమీపంలోని దుగ్గిరాలకు చెందిన గంధమనేని మాణిక్యమ్మ తన ఇంట్లో ఉదయం గ్యాస్‌పై నీళ్లు కాచుకుని దింపే సమయంలో చీరకు నిప్పంటుకుని తీవ్రగాయాలపాలైంది. ఆమెను కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అశోక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పత్తేబాద ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. పత్తేబాద, రైతు బజార్, భవిష్య క్లినిక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటే !

- మొక్కుబడిగా రోడ్డు పనులు
- నెలలోపే గోతులు ప్రత్యక్షం
- ఏలూరు రోడ్లపై రాకపోకలకు ప్రజల పాట్లు



ఏలూరు గూడ్స్ షెడ్డు రోడ్డులో పూడ్చిన గొయ్యి నుంచి బయటకొచ్చిన కంకర, చిప్స్



రోడ్డు మార్జిన్‌లో ఉన్న కంకర, చిప్స్ గుట్టలు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం తీరు చేసేది గోరంత, ప్రచారం కొండంత అనే చందంగా తయారైంది. ఏలూరు నగరంలో నవంబరు నెలంతా రోడ్లకు మరమ్మతులు చేస్తున్నట్టు ఫొటోలకు, పత్రికలకు ఫోజులిచ్చి మరీ నాయకులు ఆర్భాటం చేశారు. సమస్య తీరింది కదా ఫర్వాలేదనుకున్న ప్రజలకు నెలతిరక్కుండానే గోతులు ప్రత్యక్షమవటంతో విస్తు పోతున్నారు. హడావుడి మినహా పనుల్లో నాణ్యత లేదని, పాలకులు సొమ్ము దండుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు పాత బస్టాండ్ నుంచి తూర్పులాకుల వరకు వెళ్లే రహదారిలో రెండు వైపులా నెల రోజుల కిందట గోతులను కంకర, తారుతో పూడ్చారు. నేడు ఈ మార్గంలో యథావిధిగా గోతులు దర్శనమిస్తున్నాయి.

మరమ్మతులకు రూ.25 లక్షలు


ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం రూ.25 లక్షల అంచనాలతో రోడ్ల మరమ్మతులు చేపట్టినట్టు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. హడావుడిగా నవంబరు నెలలో ప్రధాన రహదారులు, నిత్యం జనం రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లలో మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ప్రజలు ఆనందపడ్డారు. ఐతే, నెల తిరక్కుండానే తిరిగి పూడ్చిన చోట్ల గోతులు ప్రత్యక్షం కావడంతో ప్రజల ఆనందం మూడునాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది.

నేటికీ కంకర గుట్టల దర్శనం

రోడ్ల మరమ్మతులకు కాంట్రాక్టర్ దింపిన కంకర గుట్టలు, చిన్న సైజు చిప్స్ గుట్టలు నేటికీ రోడ్డు మార్జిన్లతో దర్శనమిస్తున్నాయి. తారు కరిగించేందుకు ఏర్పాటుచేసిన పొయ్యిలు కూడా అక్కడే ఉన్నాయి. పూడ్చిన గోతుల్లోంచి చిప్స్, కంకర పైకి లేచిపోవడంతో ఆయా మార్గాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. ఏలూరు పాత బస్టాండ్ నుంచి తూర్పు లాకుల వరకు, పాత బస్టాండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్డు గోతులు పునఃదర్శనమిస్తున్నాయి. రోడ్ల మరమ్మతు పనులు మొక్కుబడిగా నిర్వహించారని, గోతుల్లో తారు ప్రసాదం మాదిరిగా రాయడంతో కంకర, చిప్స్ వెంటనే పైకి లేచిపోయాయని ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇచ్చే మామూళ్ల కారణంగా పనుల్లో నాణ్యత కొండెక్కిందంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు.



రైల్వే స్టేషన్ తూర్పు వైపు రోడ్డుపై మళ్లీ గొయ్యి



పాత బస్టాండ్ సమీపంలో దర్శనమిస్తున్న గొయ్యి



రోడ్డు మార్జిన్‌లోనే దర్శనమిస్తున్న తారు పొయ్యి

నాణ్యతా లోపం



నగరంలో పూడ్చిన గోతులు నెల రోజులు తిరక్కుండానే యథావిధిగా దర్శనమివ్వడంలో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. ఏలూరు పాత బస్టాండ్ వద్ద పూడ్చిన గోతులు మళ్లీ దర్శనమిస్తున్నాయి. ఓవర్ బ్రిడ్జి డౌన్లో పూడ్చిన గొయ్యితో కంకర లేకిపోవడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. పనుల్లో నాణ్యత ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

మరింత అధ్వానం



నెల తిరక్కుండానే కంకర పైకి లేచిన గోతులు గతం కన్నా మరింత అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవ్వక తప్పదు. ప్రచార ఆర్భాటం మినహా పనుల్లో ఎక్కడా నాణ్యత లేదు. మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యతతో పనులు చేయాలి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– జి.గోపి, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

కీలకాంశాలపై నివేదిక



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి

ఏలూరు(మెట్రో): కలెక్టర్ల సదస్సులో జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్ర నివేదికను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రభుత్వానికి అందజేశారు. జిల్లా అభివృద్ధికి యంత్రాంగం రూపొందించిన విజన్–2047 ప్రణాళిక కూడా ఇచ్చారు. రాష్ట్ర స్థాయి విజన్ ప్లాన్‌ను ఈనెల 13న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విడుదల చేయనున్నారు.

నేటి నుంచి 'అభినయ' వార్షికోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అభినయ నృత్యభారతి 29వ వార్షికోత్సవాలను ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఏలూరులోని అశోక్ నగర్ శ్రీ శలా నాగకోటేశ్వరరావు కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు అంబికా కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్ గోపాల్ లునాని, వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయ నృత్య రీతులకు చెందిన యువ కళాకారులు వివిధ రాష్ట్రాల నుంచి వస్తారని, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 400 మంది చిన్నారులు నృత్య పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు, నర్తకులకు నృత్య కౌముది అవార్డులు, వివిధ రంగాలకు చెందిన 12 మంది ప్రముఖులకు సేవా తపస్వి అవార్డులు, నృత్య రంగానికి చెందిన 10 మంది నాట్యాచార్యులకు నృత్య తపస్వి అవార్డులు అందించనున్నట్టు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



జాతీయ నాయకులకు నివాళులర్పిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్ : ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. సుస్థిర అభివృద్ధిపై గురువారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజానికి తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని, ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన పథకాలను వివరించారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన, సేవా కార్యక్రమాలపై శిక్షకులు ఏపీఎం టి.నాగేశ్వరరావు మాట్లాడారు. తొలుత ఏఓ జీవనసంధ్య, ఉద్యానవన శాఖ అధికారి కరణ్, ఎంపీడీఓ తదితరులు గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. కోటేశ్వరదుర్గాపురం, మాదేపల్లి, చాటపర్రు సర్పంచ్‌లు వర్రీ లక్ష్మీదుర్గ, శ్రీరామ్‌ప్రభుదేవ, గుడిపూడి రఘు, ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక, మొండికోడు, పెదయాగనమిల్లి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాలల మహాగర్జనకు తరలిరండి



పోస్టర్ విడుదల చేసిన మాల సంఘాల ఫెడరేషన్ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): గుంటూరులోని నల్లపాడులో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని మాల సంఘాల ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఏలూరులోని నవాబ్‌పేట, వెన్నవెల్లివారి పేట తదితర ఏరియాలు, ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తేరా ఆనంద్‌లు మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ జాబితాలో ఒక కులాన్ని తీసివేయాలన్నా, రిజర్వేషన్లు పెంచాలన్నా, వర్గీకరించాలన్నా పార్లమెంట్‌లో చర్చ జరిగి కేబినేట్ ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆర్డినెన్స్ పొందితే తప్ప అది చట్టం అవడానికి అవకాశం లేదని తెలిపారు. ఇటీవల సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను దేశంలోని ఆయా రాష్ట్రాలు ఇష్టమైతే వర్గీకరించుకోవచ్చు లేదా మనేయవచ్చునని చెప్పిందన్నారు. ఏ రాష్ట్రమైనా వర్గీకరణ చేపట్టే ముందు కుల గణన చేయాలని ఆదేశించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. తొలుత సభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పులవర్తి డేవిడ్, కనికెళ్ల మురళీ కృష్ణ, దేవదాసు ప్రేమ్, టి.సురేష్, సీహెచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



యోగా గురువు లునానిని సత్కరించిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యోగా మన శరీరం, మనసు మధ్య సమతుల్యతను చేకూర్చే ప్రాచీన భారతీయ విద్య అని, ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని స్థానిక ప్రముఖ పారిశ్రామికవేత్త, యోగా గురు వేణుగోపాల్ లునాని అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి పీజీ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో గురువారం యోగాపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో లునాని మాట్లాడారు. శరీరం మనసుల కలయికే యోగ అని, నాడీ శోధన, నాడీ శుద్ధి, ముద్రలు, ప్రాణాయామం, ధ్యానం చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. యోగ సాధన దినచర్యలో ఒక భాగంగా కావాలన్నారు. ఈ సందర్భంగా లునానిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ యలమర్తి సతీష్ బాబు, ఎంబీఏ విభాగాధిపతి రంగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలంటూ వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

దెందులూరు: తమపై పని భారం, అధిక ఒత్తిడి తగ్గించాలంటూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కె.శ్రీదేవికి గురువారం వినతిపత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నిర్ణీత విధులకు మించి పనులు చేయడం వల్ల అధిక భారం, ఒత్తిడి ఎక్కువై అనారోగ్యం పాలవుతున్నామని తెలిపారు.

ఇంటర్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉంగుటూరు : నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులకు గురువారం రూ.25 వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ఎకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ సీహెచ్‌వీవీ రామచంద్రరావు, అధ్యాపకులు కె.వైనాయుడు, కె.దుర్గయ్య, జి.శ్రీనివాసు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

ఉంగుటూరు: మండలంలోని ఏడు మేజరు సాగునీటి సంఘాలకు, 8 మైనర్ ఇరిగేషన్ సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. పోటీచేసే రైతులు వీఆర్వోకు నామినేషన్ తోపాటుగా నో డ్యూస్ సర్టిఫికెట్టుతో పన్ను రసీదును అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	27

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07, 10
బెండకాయలు	30	కంద	64
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	64
కాకర కాయలు	28–36	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	60	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	55	గోంగూర	07
గోరుచిక్కుడు	26	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

అన్నదాతకు అందని సాయం

- వరస తుఫాన్లతో తగ్గిన ఖరీఫ్ దిగుబడి
- ధాన్యం సొమ్ము పెట్టుబడి, వడ్డీలకే సరి
- రబీ పెట్టుబడి కోసం ఎదురుచూపులు



లోడ్ చేసేందుకు ధాన్యం బస్తాలను సిద్ధం చేస్తున్న బువ్వనపల్లి రైతులు

నిడమర్రు: ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమైనా నేటికీ రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతులు పెట్టుడి కోసం ముందుగానే వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు పెట్టుబడి కేంద్ర ప్రభుత్వం సాయంతో కలిపి రైతు కుటుంబానికి రూ.20 వేలు అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక కేంద్రం వాటా రూ.4 వేలు అందినా, నేటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాటా అందలేదని రైతులు వాపోతున్నారు. పైగా అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని కూడా కూటమి సర్కారు తమపైనే మోపిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల తరఫున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి, వారిని ఆదుకుంది. పంట సాగుచేసే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా క్రమం తప్పకుండా జమచేసేది. ఐదో విడత సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయినా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. దీంతో రైతులు కూటమి సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు చిన్న, సన్నకారు రైతులు 25 వేల మందికిపైగా ఉన్నారు. ఈ ఏడాది 32 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. నిడమర్రు మండలంలో 12447 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రైతులు ప్రతి ఏటా జూన్, జులైలో వరి పంట సాగు చేస్తారు. పెట్టుబడి పెట్టే సమయంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఉంటే అప్పుల బాధ తప్పేది. ప్రస్తుతం చేతికందిన ఖరీఫ్ పంట పెట్టుబడి అప్పులకే సరిపోయిందని రైతులు చెబుతున్నారు. ఎన్నికల హామీ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు.

నాలుగేళ్లలో రూ.54 వేల చొప్పున జమ

వైఎస్సార్ సీపీ హయాంలో రైతుకు ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.7500, కేంద్ర నుంచి రూ.6 వేలు కలిపి రూ.13,500 చొప్పున రైతు బ్యాంక్ ఖాతాలో పంట వేసుకునే సమయంలో జమయ్యేది. వరుసగా నాలుగేళ్లపాటు మొత్తం రూ.54,000 రైతుల ఖాతాల్లో జమైంది. ఎన్నికల కోడ్ కారణంగా ఐదో విడత రైతు భరోసా నగదు నాటి ప్రభుత్వం జమ చేయలేకపోయింది. అనంతరం అధికారంలో కొచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.80 వేలు రైతులకు అందిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ అమలు చేయకపోవడంతో నియోజకవర్గం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత నాలుగేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా వివరాలు

మండలం	లబ్ధిదారులు	అందిన లబ్ధి రూ.కోట్లలో..
ఉంగుటూరు	10109	44.25
భీమడోలు	4681	23.51
గణపవరం	6529	27.48
నిడమర్రు	4200	17.83
మొత్తం	25,519	113.07

బిషప్ జాన్ ములగడకు ఘననివాళి



జాన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫాదర్లు

పెదవేగి : ఏలూరు కథోళిక పీఠంలో బిషప్ జాన్ ములగడ చేసిన సేవలు చిరస్మరణీయమని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో దివంగత బిషప్ జాన్ ములగడ 87వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్ అధ్యక్షతన బిషప్ జాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫిలిప్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, డెంటల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, సిబ్బంది విద్యార్థులు నివాళులర్పించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

పెదవేగి : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలవర పరిసింది. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన సువ్వా కళ్యాణ్ (27) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కొక్కానికి చీరతో ఉరి వేసుకున్నాడు. అతని తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.